అధిష్ఠానంపై బోడె ధిక్కార స్వరం

- సీటు లేదని తేల్చిన చంద్రబాబు
- అన్యాయం జరిగిందంటూ జనంలోకి వెళ్లిన బోడె
- కుటుంబ సభ్యులతో కలిసి యనమలకుదురు నుంచి ప్రచారం మొదలు
- సీటు ఇవ్వకపోతే స్వతంత్రంగా పోటీకి సిద్ధం


యనమలకుదురు నుంచి కుటుంబంతో సహా ప్రచారాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు: పెనమలూరు సీటు వ్యవహారంపై చంద్రబాబు చేతులెత్తేశారు. బోడెకు సీటు ఇవ్వడం కుదరదని తేల్చిచెప్పారు. అధిష్టానం పొమ్మనకుండా పొగబెట్టడంతో బోడె ప్రసాద్ అధిష్టానం తీరును ఎండగడుతున్నారు. వెధవల్ని తీసుకొచ్చి పోటీకి నిలబెడతానంటే చూస్తూ ఊరుకోనని వ్యాఖ్యానించారు. సీటు ఇస్తే పార్టీ గుర్తుపైనా.. లేకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానంటూ శుక్రవారం నుంచి ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టారు.

తాజాగా విడుదల చేసిన ఆ పార్టీ అభ్యర్థుల జాబితాలో పెనమలూరు వ్యవహారం తేల్చకపోగా అధిష్టానం నుంచి బోడె ప్రసాద్‌కు ఫోన్ ద్వారా సీటు లేదని చెప్పడం తెలిసిందే. దీంతో మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జి బోడె ప్రసాద్ వర్గంలో గుబులు మొదలైంది. నియోజకవర్గ పార్టీ కార్యాలయం వేదికగా కార్యకర్త పెట్రోలు పోసుకుని నిప్పంటించుకునే యత్నం చేసి అధిష్టానం నిర్ణయానికి నిరసన తెలిపాడు. పార్టీకి మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సహా పార్టీ ముఖ్య బాధ్యులు అధిష్టానంపై ఆగ్రహం వెళ్లగక్కారు. రాజీనామాల ద్వారా అధిష్టానాన్ని బెదిరింపులకు గురిచేసి సీటు దక్కించుకోవాలనే యోచన చేశారు.

చంద్రబాబు మొండిచేయి..

అసంతృప్తితో ఉన్న బోడె ప్రసాద్‌ను బుజ్జగించేందుకు పార్టీ నేతలు మంతనాలు జరిపారు. బోండా ఉమా పోరంకిలోని పార్టీ కార్యాలయానికి వచ్చి బుజ్జగించే యత్నం చేసినా బోడె ససేమిరా అనడంతో చంద్రబాబు పిలిపించారు. అయితే అక్కడ కూడా బోడెకు నిరాశే ఎదురైంది. సీటు కుదరదని చంద్రబాబే స్వయం చెప్పి మొండిచేయి చూపారు. ఈ విషయాన్ని భేటీ తర్వాత బోడెనే స్వయంగా శ్రేణులకు చెప్పి ఇన్నాళ్లూ పార్టీకి కోట్లు ఖర్చు పెడితే వాడుకుని వదిలేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. టీడీపీలో వాడుకోవడం, వదిలేయడం పరిపాటిగా మారిందన్నది దీంతో మరోసారి రుజువైంది.

సీటు వెధవలకిస్తే ఊరుకోం..

పెనమలూరు సీటు గెలుస్తామని నమ్మకం ఉన్నా, తనకు సీటు ఇవ్వకుండా వెధవలకు, ఓడిపోయే అభ్యర్థికి ఇస్తే ఊరుకోనంటూ బోడె వ్యాఖ్యానించారు. పెనమలూరు సీటును దేవినేని ఉమాకు ఇస్తున్నారనే ప్రచారం ఉంది. లేనిపక్షంలో దేవినేని బాజీప్రసాద్ కుటుంబం నుంచి మహిళకు కేటాయించే అవకాశం ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బోడె ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు ఇక్కడి నుంచి ఎవరు పోటీచేసినా వారికే వర్తిస్తుందని, ఆ మాటల్లో అంతర్యం అదే అన్నది పార్టీ వర్గాలు అంటున్నాయి. పార్టీని ముంచే వాళ్లకు అవకాశం ఇవ్వద్దని, బయటి పార్టీల్లో గంజాయి మొక్కలు, పార్టీలో చేరేసరికి తులసి మొక్కలు ఎలా అయ్యాయి? అంటూ బోడె మీడియాతో మాట్లాడుతూ సంధించిన ప్రశ్నలు ఇటీవల ఆ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, వసంత కృష్ణప్రసాద్‌లకు వర్తిసాయని పార్టీలో చర్చ సాగుతోంది.

యనమలకుదురు నుంచి ప్రచారం మొదలు..

అధిష్టానం సీటు లేదని తేల్చడంతో తనకు అన్యాయం జరిగిందంటూ బోడె ప్రసాద్ కుటుంబ సభ్యులతో సహా యనమలకుదురు గ్రామం నుంచి ఇంటింటి ప్రచారం మొదలుపెట్టారు. అధిష్టానం అన్యాయం చేయాలని చూస్తోందని, ప్రజలే న్యాయం చేయాలని ఓట్లు అడిగారు. చివరి నిముషం వరకూ రోడ్లమీద, ప్రజల్లో ఉంటానని, సీటు ఇస్తే సైకిల్ గుర్తుపైనా, లేకపోతే స్వతంత్రంగానైనా పోటీ చేస్తా.. అంతేతప్ప ఎవరికో సీటు ఇచ్చాం అంటే ఊరుకోను అంటూ అధిష్టానానికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చాడు బోడె ప్రసాద్.

పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయం


పట్టాలు అందజేస్తున్న ఎంపీపీ ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు తదితరులు

రామవరప్పాడు: పేద, మధ్య తరగతి కుటుంబాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు కాకర్లమూడి సువర్ణరాజు అన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి పేరిట రామవరప్పాడు రైవస్ కాలువ వెంబడి నివాసం ఉంటున్న కుటుంబాలను ఖాళీ చేయించి జక్కంపూడిలో ప్లాట్స్ కేటాయించిన వారికి శుక్రవారం రామవరప్పాడు పంచాయతీ కార్యాలయం వద్ద పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ రైవస్ కాలువ వెంబడి నివాసం ఉంటున్న పేదలను టీడీపీ ప్రభుత్వంలో బలవంతంగా ఖాళీ చేయించారని, ఎన్నో పోరాటాల అనంతరం జక్కంపూడి కాలనీలో ప్లాట్స్ ఇచ్చారని గుర్తు చేశారు. కంటి తుడుపు చర్యగా ప్లాట్స్ కేటాయించారు కానీ బాధితులకు పట్టాలు, ప్లాట్స్‌లో మౌలిక వసతులు కల్పించలేదన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని బాధితులు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు విన్నవించడంతో ప్రత్యేక చొరవ తీసుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారని తెలిపారు. వెంటనే స్పందించిన సీఎం జగన్ బాధితులందరికీ రిజిస్ట్రేషన్ చేయించి పట్టాలు ఇవ్వాలని ఆదేశించడంతో 460 కుటుంబాలకు నేడు పట్టాలు అందాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, వీఆర్వో రాధాకృష్ణ, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

దావాజిగూడెంలో..

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం గ్రామ సచివాలయంలో శుక్రవారం ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ దస్తావేజులను పంపిణీ చేశారు. ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య చేతుల మీదుగా దస్తావేజులను అందజేశారు. ఎంపీపీ రవి మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. పేదలకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. సర్పంచ్ బడుగు బాలమ్మ, పార్టీ నాయకురాలు సూరెడ్డి మణిమ్మ, ఇన్‌చార్జి కార్యదర్శి బాపూజీ, వీఆర్వో శ్రీరామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


దావాజిగూడెంలో రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు

గన్నవరం రూరల్: మండలంలోని గొల్లనపల్లి గ్రామ సచివాలయంవద్ద ఇంటి రిజిస్ట్రేషన్ దస్తావేజులను 120మంది లబ్ధిదారులకు శుక్రవారం ఎంపీపీ అనగాని రవి పంపిణీ చేశారు. సర్పంచ్ గణవరపు శాంతి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ రవి మాట్లాడుతూ రాష్ట్రంలో 30లక్షల మందికిపైగా పేదలకు ఒకేసారి ఇంటి నివేశన స్థలాలు ఇవ్వడం రాష్ట్ర చరిత్రలో మొదటిసారి అని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెత్తందారుల వ్యవస్థను రూపుమాపి గ్రామస్వరాజ్యాన్ని నెలకొల్పారని అన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామంలోనే అన్ని రకాల సేవలను అందుబాటులో ఉంచి, సంక్షేమ ఫలాలను ప్రతీ గడపకు అందజేసిన జగనన్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, పార్టీ గ్రామ అధ్యక్షుడు పలగాని శోభనాద్రి, నాయకులు కోటగిరి ప్రసాద్, పడమట సురేష్, వీఆర్వో రకీబ్, సచివాలయ కార్యదర్శి నున్న శివనాగరాజు, మెండే రమేష్, రవి, సూరెడ్డి మణిమ్మ, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలి


పొట్టిపాడులో ప్రచారం చేస్తున్న ఎంపీపీ సరోజిని, నాయకులు

ఉంగుటూరు: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ ప్రజల మన్ననలను పొందిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని కోరారు. పొట్టిపాడులో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజలకు ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని వివరిస్తూ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సరోజిని వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన నిర్లక్ష్యాన్ని, నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కత్తుల జ్యోతి, మండల జేసీఎస్ కన్వీనర్ వింత ఆదినారాయరెడ్డి, ఎన్నికల పరిశీలకుడు రామిశెట్టి వెంకటేశ్వరరావు, గ్రామ కన్వీనర్ బొబ్బిలి జగన్, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు మండలంలో ఎనిమిది పరీక్ష కేంద్రాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ నిమిత్తం బాపులపాడు మండలంలో ఎనిమిది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శ్రీరామ్‌బాలాసింగ్ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో మొత్తం 1026 మంది విద్యార్థులు టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయని, పరీక్షా కేంద్రానికి విద్యార్థులు గంట ముందుగా చేరుకోవాలని సూచించారు.

వైభవంగా శ్రీసుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో శుక్రవారం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. అమ్మవారి ఆలయ మహా మండపం ఏడో అంతస్తులోని కళావేదిక వద్ద శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఆలయ ఈఓ కేఎస్ రామారావు, పాలక మండలి సభ్యులు, ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. ప్రతి మాసం షష్టిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా జరుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులున్నా, సంతాన, వివాహ యోగం లేని వారు కల్యాణోత్సవంలో పాల్గొని సేవ చేసుకునే వారికి సమస్య పరిష్కారమవుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం కళావేదిక వద్ద నుంచి స్వామి వారి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగింపుగా పుట్ట వద్ద ఆలయానికి తీసుకెళ్లారు. ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

క్లుప్తంగా

జగనన్న మేలు ఎప్పటికీ మరువం



ఉయ్యూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టైలర్ల సంక్షేమానికి చేసిన కృషిని ఎప్పటికీ మరువమని ఉయ్యూరు టైలర్స్ అన్నారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను టైలర్లు శ్రీను, వెంకటరావు, అగ్గిరాముడు, ఇబ్రహీం, ఉస్మాన్, దుర్గాప్రసాద్‌లు శుక్రవారం గంగూరులోని పార్టీ కార్యాలయంలో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైలర్లమంతా సీఎం జగనన్నతోనే ఉంటామన్నారు. టైలర్ల సంక్షేమం కోసం తొలిసారి పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దేనని అన్నారు. పెనమలూరులో మంత్రి రమేష్ విజయానికి కృషి చేసి వైఎస్సార్ సీపీకి అండగా నిలుస్తామని పేర్కొన్నారు.

రక్తదానం చేయడం వరం



ఉంగుటూరు: రక్తదానం చేసే అవకాశం ఒక వరంలా భావించి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, అమెరికన్ క్యాన్సర్ కేర్ బ్లడ్ సెంటర్(విజయవాడ) సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో ఏడాదికి రెండు సార్లు రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రతీ ఒక్కరు ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు రక్తదానం చేయాలని ప్రిన్సిపాల్ జీవీకే ఎస్వీ ప్రసాద్ పేర్కొన్నారు. శిబిరంలో 60 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీహరిబాబు, డాక్టర్ తులసీరామ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు స్వేచ్ఛగా ఓట్లు వేయాలి



పెనమలూరు: ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓట్లు వేయాలని పెనమలూరు సీఐ టీవీవీ రామారావు అన్నారు. పోరంకి గ్రామంలో శుక్రవారం కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ ప్రజలు ఓట్లు వేయడానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అన్నారు. సంఘ వ్యతిరేక శక్తుల ఆట కట్టించడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పారదర్శక ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నామని వివరించారు. ఎస్ఐలు శేషుకుమార్, ఉషారాణి, సిబ్బంది ఏసేబు, వెంకటేశ్వరరావు, రమేష్, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



పెనమలూరు: పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి గీతాబాయ్ గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటల ఆస్పత్రిగా పనిచేస్తోంది. అయితే రాత్రి సమయాల్లో సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అనే విషయమై ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో వసతులు, మందులు, సిబ్బంది హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. జిల్లా వైద్యాధికారి రాత్రి సమయంలో ఆస్పత్రి తనిఖీ చేయడంతో సిబ్బంది ఖంగుతిన్నారు.

22న మండల పరిషత్ సమావేశం

కంకిపాడు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. శుక్రవారం ఆమె వివరాలు తెలుపుతూ మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ పనులపై సమీక్ష ఉంటుందన్నారు. ఆయా శాఖల అధికారులు అభివృద్ధి నివేదికలను ఈ నెల 19వ తేదీ లోపు మండల పరిషత్ కార్యాలయంలో అందించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉయ్యూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉయ్యూరు మండలంలో శనివారం ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఉయ్యూరు డీఈ కృష్ణనాయక్ తెలిపారు. ముదునూరు, పెద ఓగిరాల సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు శనివారం చేపడుతున్నామని అన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం సాయంత్రం 3.30 నుంచి ఆరు గంటల వరకు గన్నవరం సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక చింతలపేట, రామ్‌నగర్, సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ ఏరియా, ఇస్లాంపేట, కొత్తపేట, పాతగన్నవరం, చెంచుల కాలనీ, శేషసాయి గార్డెన్, బీబీ.గూడెం రోడ్డు, దుర్గాపురం, ఎయిర్‌పోర్ట్ సిటీ, ఆశ్రమం ఏరియా, చిక్కవరం, గొల్లనపల్లి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

సీఏఏకు వ్యతిరేకంగా సీపీఎం ప్రచారం

గన్నవరం: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సీఏఏను వ్యతిరేకించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మసీదు వద్ద ప్రచార కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఇస్లాంపేటలో ఇంటింటికి వెళ్లి సీఏఏ వల్ల పొంచి ఉన్న ప్రమాదంపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు ఆర్.రఘు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తినీ దెబ్బతీసే విధంగా సీఏఏను తీసుకువచ్చిందని చెప్పారు. ఈ చట్టం దేశంలోని ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారుతుందని అన్నారు. పార్టీ నాయకులు మీరాఖాన్, సర్దార్, దాదా, ఆంజనేయులు పాల్గొన్నారు.

23 నుంచి శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఈ నెల 23 శనివారం నుంచి 25వ తేదీ వరకు శ్రీకాశీ విశ్వేశ్వర స్వామివార్ల దేవస్థానం బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎస్.అరుణ తెలిపారు. శుక్రవారం దేవస్థానం ఆవరణలో విలేఖరులతో ఈఓ అరుణ, ప్రధాన అర్చకులు డాక్టర్ మామిళ్లపల్లి ఫణీకుమార్, సుబ్బారావు మాట్లాడారు. 23న ఉదయం ఎనిమిది గంటలకు గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచన, పంచగవ్య ప్రాసన, రక్షాబంధన, దీక్షస్వీకరణ, అఖండస్థాపన, స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగును. సాయంత్రం అగ్నిప్రతిష్ట, మూర్తి హోమాలు, ధ్వజారోహణ హారతి, 24 సాయంత్రం దివ్య కల్యాణ మహోత్సవం, 25న రథోత్సవం, నిత్యార్చన, విశేష హోమాలు, పూర్ణాహుతి, వసంతోత్సవం జరుగునని తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని వారు విజ్ఞప్తి చేశారు.

విలువలతో కూడిన విద్యనభ్యసించాలి


విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేస్తున్న ఎస్ఐ సందీప్

కంకిపాడు: ఉన్నత విలువలతో కూడిన విద్యనభ్యసించాలని ఎస్ఐ డి.సందీప్ సూచించారు. మండలంలోని మద్దూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు దాత, ఎంపీటీసీ సభ్యుడు వడుగు శ్రీనివాసరావు వితరణతో శుక్రవారం పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. ఎస్ఐ సందీప్ మాట్లాడుతూ నైతిక విలువలు లేకపోతే ఎంత చదివినా నిరర్ధకమని అన్నారు. సమాజ అభ్యున్నతిలో భాగస్వాములు కావాలని ప్రతి ఒక్కరూ మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిప్పల రామదాసు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, సచివాలయ కన్వీనర్ వీరంకి స్వాతి, హెచ్ఎం కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ కుమార్‌బాబు

పెనమలూరు: ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీఎల్ఓలు విధులు సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్ సూచించారు. పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు క్లెయిమ్ ఫారాలు త్వరితగతిన పరిష్కారం చేయాలన్నారు. ఓటర్ల ఇంటికి వెళ్లి ఓట్లు పరిశీలించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి రాలేని వృద్ధులు, తీవ్ర అనారోగ్యంతో మంచం పట్టిన ఓటర్ల ఓట్లు ఇళ్ల వద్దే వేయించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

పెనమలూరు: పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 30 సచివాలయాలకు చెందిన సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో కోడ్‌ను అనుసరించి ఉద్యోగస్తులు విధులు నిర్వహించాలని ఎంపీడీఓ కుమార్‌బాబు అన్నారు. కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ఎక్కడన్న కోడ్ ఉల్లంఘన జరిగితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చూపితే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ లోయ శివశంకర్‌రావు, ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గీతాంజలి ఆత్మహత్య కారకులను శిక్షించాలి


గీతాంజలి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళా నేతలు

గన్నవరం: తెనాలికి చెందిన గీతాంజలి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో గీతాంజలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ దస్తావేజు తీసుకున్న ఆనందాన్ని గీతాంజలి మీడియాతో పంచుకోవడం నేరమా అని ప్రశ్నించారు. ఆ వీడియోను కిరాతకులు, రాబందులైన ఐటీడీపీ సైన్యం సోషల్ మీడియాలో నీచంగా ట్రోల్ చేయించి ఆమె మరణానికి కారకులయ్యారని పేర్కొన్నారు. ఈ కేసులో నిందితులు అందరినీ పోలీసులు తక్షణం అరెస్ట్ చేయాలని కోరారు. పార్టీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి సూరెడ్డి మణిమ్మ, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నగర మార్కెట్‌లోకి సరికొత్త క్రెటా కారు


క్రెటా ఎన్‌లైన్ కారును ఆవిష్కరిస్తున్న ఫణీకుమార్

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని సాయిస్వర్ణ హ్యుండాయ్ షోరూమ్‌లో శుక్రవారం సరికొత్త క్రెటా ఎన్ లైన్ కారును చోలమండలం ఫైనాన్స్ ఏరియా మేనేజర్ ఎస్ ఫణీకుమార్ నగర మార్కెట్‌లోకి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూమ్ జనరల్ మేనేజర్ భగత్‌సింగ్ మాట్లాడుతూ నూతన క్రెటా ఎన్‌లైన్ కారు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, భద్రతా సౌకర్యాలతో రూపుదిద్దుకుందని తెలిపారు. ఈ కారులో 18 అంగుళాల డైమండ్ కట్ అలాయ్ వీల్స్, అడ్వాన్స్ డ్రైవర్ అసిస్టెంట్ సిస్టమ్, 70ప్లస్ స్టాండర్డ్ సెఫ్టీ ఫీచర్స్‌తో పాటు ఆకర్షణీయమైన మోనో టోన్, డ్యూయల్ టోన్ రంగుల్లో లభిస్తుందని తెలిపారు. ఈ కారు రూ. 16.82 లక్షల నుంచి లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వినియోగదారులు, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన


మాట్లాడుతున్న నాగళ్ల విద్యాకన్నా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాకన్నా చెప్పారు. అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా రావిచెట్టు సెంటర్‌లోని సంస్థ కార్యాలయం ఆవరణలో శుక్రవారం సభ జరిగింది. విద్యాకన్నా మాట్లాడుతూ మనం ఏదైనా వస్తువును కొనుగోలు చేసి మోసపోతే వినియోగదారుల రక్షణకు చట్టాలు ఉన్నాయన్నారు. వాటితో నష్టపరిహారం పొందవచ్చని చెప్పారు. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పొందే హక్కు, ప్రాథమిక అవసరాలు పొందే హక్కు, వస్తువులు, సేవలను ఎంపిక చేసుకునే హక్కు, ఉత్పాదకాల గురించి తెలుసుకునే హక్కు ఉన్నాయని వివరించారు. జనశిక్షణ సంస్థాన్ సీనియర్ రిసోర్స్ పర్సన్ పి.వరలక్ష్మి మాట్లాడుతూ వినియోగదారుల ఉద్యమ పితామహుడు రాల్ఫ్‌నాడర్ కృషితో ఈ రోజు అంతర్జాతీయ వినియోగదారుల ఉద్యమ సంఘాలు ఏర్పడ్డాయని, వీటితో వినియోగదారుల సంరక్షణ, సంక్షేమం, సేవలు అందుతున్నాయని చెప్పారు. నిత్య జీవితంలో ప్రతి వ్యక్తి ఏదో ఒక వస్తువును లేక సేవలను కొనుగోలు చేయడం సర్వసాధారణమని చెప్పారు. ఆ వస్తువులు, సేవల్లో ఏదైనా లోపం వస్తే వినియోగదారుల ఫోరంను ఆశ్రయించవచ్చన్నారు. జనశిక్షణ సంస్థాన్ సిబ్బంది, శిక్షణార్థులు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ధైర్యంగా సిద్ధం కండి

జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా

కంకిపాడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మరో మూడు రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఈ విద్యాసంవత్సరంలో పదిలో నూరు శాతం ఫలితాలు సాధించేలా విద్యాశాఖ ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంది. అదనపు తరగతుల ద్వారా, ప్రతీ ఒక్క విద్యార్థి పైనా ప్రత్యేక శ్రద్ధతో విద్యాబోధన సాగేలా నిరంతరం పర్యవేక్షించింది. స్వల్ప జాగ్రత్తలు వహిస్తూ, టెన్షన్‌కు దూరంగా ఉంటే సమర్థంగా పరీక్షలను ఎదుర్కోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా సూచించారు. కృష్ణాజిల్లా వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు 151 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 21,458 మంది, ప్రైవేటు విద్యార్థులు 5,049 మంది పరీక్షలకు హాజరుకాబోతున్నారు అని తెలిపారు. పరీక్షల నిర్వహణపై సిబ్బంది ఇప్పటికే అవసరమైన శిక్షణ పూర్తి చేశారన్నారు. ప్రశ్నపత్రాలను ఆయా కేంద్రాల పరిధిలోని పోలీసుస్టేషన్లలో భద్రపరిచినట్లు వెల్లడించారు.

ఒలింపియాడ్‌లో 'చైతన్య' ప్రతిభ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇండియన్ నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షలో తమ చైతన్య విద్యాసంస్థలకు చెందిన భాస్కర్ భవన్ స్కూల్ కాంపౌండ్‌లో 10వ తరగతి విద్యార్థి రాపోలు గౌతమ్‌కుమార్ ప్రతిభ చూపి తదుపరి రౌండ్ (ఐఎంఓటీసీ)కి ఎంపిక అయ్యాడని చైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు.